క్లుప్తంగా

రీ సర్వే వేగవంతం చేయండి

గూడూరు: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షలో భాగంగా చేపట్టిన వ్యవసాయ భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని బందరు ఆర్డీఓ ఐ.కిషోర్ అన్నారు. గూడూరు మండలం కోకనారాయణపాలెంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహిస్తే భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు అవకాశం ఉండదని చెప్పారు. తహసీల్దార్ బీవీ ప్రసాద్, మండల సర్వేయర్ జి.వెంకటేశ్వరరావు, వీఆర్వో కాకుశేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

మోపిదేవి: బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు ముడిమేల లక్ష్మీదేవి అన్నారు. పెదకళ్లేపల్లి, వెంకటాపురం, రావివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు పిల్లలు దూరంగా ఉండాలన్నారు. తొలుత వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ

అవనిగడ్డ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అవనిగడ్డలో నిర్వహించిన తొలి ప్లేస్‌మెంట్‌లో శిక్షణ పొందిన 25 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సర్టిఫికెట్లను అందజేశామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. ఉమారాణి, వైస్ ప్రిన్సిపాల్ కేవీ శాంతకుమారి, కళాశాల ఎస్‌పీఓసీ ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అగ్ని బాధితుడికి సాయం

వెలువోలు(చల్లపల్లి): వెలువోలులో వైద్య ఆరోగ్య శాఖ ఉప కేంద్రంలో డాప్లర్ మిషన్ కొనుగోలు నిమిత్తం గ్రామ ప్రముఖుడు వేములమడ కుమారస్వామి బుధవారం రూ.5 వేలు విరాళం అందజేశారు. ఇటీవల అగ్ని ప్రమాదంలో పూరిల్లు కాలిపోయి కట్టుబట్టలతో నిలిచిన బొల్లా శ్రీనివాసరావుకు రూ.10 వేలు, ఇటీవల కాలు కోల్పోయిన మందపాకల కృష్ణారావుకు రూ.10 వేలు సాయం అందజేశారు. సర్పంచ్ వేములమడ రజిత, ప్రముఖులు వేములమడ అనిల్ కుమార్, కృష్ణారావు, శివయ్య పాల్గొన్నారు.

లింగ వివక్షతపై అవగాహన

పెడన: లింగవివక్షతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చేవేంద్ర పీహెచ్‌సీ వైద్యాధికారి టి. వరప్రసాదబాబు అన్నారు. బుధవారం ఆయన కొంగంచర్ల గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. లింగ వివక్షత వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

4న ఆశీల వసూళ్లకు వేలం

పెడన: పట్టణంలోని పండ్లు, పూలు, కూరగాయల మార్కెట్, మత్స్య, మాంసాదుల మార్కెట్, వారపు సంతకు సంబంధించి ఆశీల వసూళ్లకు వేలం పాటలు ఈ నెల 4వ తేదీన పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే వేలంలో పాల్గొనే పాటదారులు మున్సిపల్ కార్యాలయంలోని సంబంధిత సిబ్బందిని కలిసి పూర్తి సమాచారం పొందాలన్నారు.

మున్సిపల్ పార్కులో స్టాల్స్ నిర్మించాలని వినతి

మచిలీపట్నంటౌన్: స్థానిక మునిసిపల్ పార్కులో స్టాల్స్ నిర్మాణం చేపట్టి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు బుధవారం నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

పెడన: సీసీఏ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహించినందుకు పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజును సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణా జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బీఎస్‌వీఆర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సివిక్స్ అధ్యాపకురాలు రాజ్యలక్ష్మీ భర్తపై మచిలీపట్నంలోని చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది ఆగస్టులో ప్రిన్సిపాల్ కేసు పెట్టారు. ఈ కేసుకు సంబంధించి ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. సెప్టెంబర్‌లో జరిగిన విచారణకు కూడా ప్రిన్సిపాల్ హాజరు కాలేదు. దీంతో ఇంటర్మీడియట్ కమిషనర్ ఎంవీ శేషగిరి బాబు ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ ఉత్తర్వులను కళాశాలలోని ప్రిన్సిపాల్‌కు బుధవారం అందజేశారు.

వృద్ధురాలికి బెదిరింపులు

పెడన: మండలంలోని నందమూరు గ్రామానికి చెందిన పరసా నారాయణమ్మ (75) ఒంటరిగా జీవిస్తోంది. అదే గ్రామానికి చెందిన బసవగిరి కోటయ్య అనే వ్యక్తి ఇంట్లో ఉన్న బంగారం, నగదు ఇవ్వాలని ఆమెను బెదిరించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో పారిపోయాడు. ఈ మేరకు బాధితురాలు పెడన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ టి. సురేష్ కేసు నమోదు చేశారు.

అక్రమాలకు అడ్డుకట్ట

- ఉపాధిలో జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం
- బందరు డివిజన్‌లోని 11 మండలాల్లో 97.61 శాతం పూర్తి
- పారదర్శకతకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వాలు



ఉపాధి పనులు చేస్తున్న పథకం కూలీలు (ఫైల్)

కోడూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్)లో అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కూలీల జాబ్‌కార్డులతో ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. ఈ ప్రక్రియను బందరు డివిజన్‌లోని 11 మండలాల్లో ఉపాధి పథకం సిబ్బంది వేగంగా నిర్వహిస్తున్నారు. పనుల కల్పన, వేతనాల చెల్లింపు, ఇతర అంశాల్లో పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు ఆధార్ అనుసంధానికి శ్రీకారం చుట్టారు. గతంలో ఒకరికి రెండు జాబ్ కార్డులు ఉన్న ఉదంతాలు వెలుగులోకి రావడంతో పాటు వివాహాలు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, గృహాలు, మరుగుదొడ్లు నిర్మించుకున్నవారు పనుల కల్పన విషయంతో రెండో జాబ్ కార్డు పొందిన ఘటనలు అనేకం ఉన్నాయి. జాబ్‌కార్డుల మంజూరు విషయంతో తనిఖీలు చేసేందుకు స్పష్టమైన ప్రక్రియ లేకపోవడంతో అదనపు కార్డుల సంఖ్య కూడా పెరిగింది.

డివిజన్‌లో 97.61 శాతం పూర్తి

ఆధార్ అనుసంధానం ప్రక్రియను అన్ని మండలాల్లో 95 శాతానికి పైగా పూర్తి చేశారు. బందరు డివిజన్‌లో అవనిగడ్డ, బందరు, పెడన నియోజకవర్గాల్లో ఇప్పటికే 97.61 శాతం మేర జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానాన్ని పూర్తి చేశారు. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో 1,00,104ల జాబ్‌కార్డులు ఉండగా వీటికి సంబంధించి పథకం కింద 1,87,845 కూలీలు ఉన్నారు. ప్రస్తుతం 1,82,773 మంది సంబంధించి ఆధార్ అనుసంధాన ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. అత్యధికంగా అవనిగడ్డ మండలంలో 99.9 శాతం, నాగాయలంక మండలంలో 99.7 శాతం మేర అనుసంధాన ప్రక్రియ పూర్తయింది. కోడూరులో 98.02 శాతం, మోపిదేవిలో 98.48, చల్లపల్లిలో 97.38, ఘంటసాలలో 95.56, బంటుమిల్లిలో 94.76, గూడూరులో 97.62, కృత్తివెన్నులో 98.70, మచిలీపట్నంలో 96.63, పెడనలో 96.87 శాతం ఆధార్ సీడింగ్‌ను పథకం అధికారులు పూర్తి చేశారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి..

గతంలో ఒక కుటుంబంలో తండ్రి, కుమారులు, సోదరులకు ఒక జాబ్‌కార్డు ఉండేది. కుమారుడికి వివాహమైతే వేరే జాబ్‌కార్డు పొందేవారు. కుమార్తెకు వివాహమై వేరే ప్రాంతానికి వెళితే మరో జాబ్‌కార్డులో చేర్చేవారు. పాత కార్డులో వీరి పేర్లు మాత్రం తొలగింపు జరిగేది కాదు. ఈ క్రమంలో వేతనాల చెల్లింపు, సాంకేతిక సమస్యలతో పాటు పథకాలు దుర్వినియోగమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తాయి. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా మారింది. ఈ ఆధార్ అనుసంధానం ద్వారా ఒక వ్యక్తి కేవలం ఒక కార్డులో ఉండేందుకు మాత్రమే వీలు ఉండడంతో పాటు పథకానికి సంబంధించిన అన్ని లావాదేవీలు, పనులు కూడా ఆధార్ ద్వారా జరుగనున్నాయి.

అనుసంధానం ప్రక్రియ త్వరలో పూర్తి



ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులోని సభ్యులకు ఆధార్ కార్డు అనుసంధానం ప్రక్రియ త్వరలోనే పూర్తి చేస్తాం. దీని వల్ల పథకంలో ఏవిధమైన అవకతవకలు జరుగకుండా నివారించవచ్చు. పనుల కల్పనలో అంచనాలు, వేతనాల చెల్లింపుల్లో ఇబ్బందులు అధిగమించేందుకు ఇది దోహదపడుతుంది. ఆధార్ అనుసంధానం కానివారు ఆధార్ కేంద్రాలకు వెళ్లి అప్‌డేట్ చేయించుకోవాలి.

– సూర్యనారాయణ, డ్వామా పీడీ

ఇంటికే వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తున్నారయ్యా

- జగనే మళ్లీ సీఎం కావాలని లబ్ధిదారుల ఆశీర్వాదం
- పెడన 12వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం
- పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి జోగి రమేష్



మానసిక దివ్యాంగురాలితో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్



వైఎస్సార్ సీపీలో చేరిన భగవాన్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి జోగి రమేష్

పెడన: ఎలాంటి ఇబ్బందులు లేకుండా తెల్లవారుజామునే ఇంటికి వచ్చి పింఛను సొమ్ము ఇస్తున్నారయ్యా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలి.. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలి అంటూ అవ్వాతాతలు, పెన్షన్ లబ్ధిదారులు ఆశీర్వదించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పట్టణంలోని 12వ వార్డులో బుధవారం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సమన్వయకర్తలతో కలిసి వార్డులోని అర్హులైన వారికి పింఛన్లను అందజేశారు. ప్రతి గృహానికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులను ఆప్యాయంగా పలుకరించి పింఛన్ల వివరాలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ వేకువ జామున నిద్ర లేపి లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే మీ ముందుకు వచ్చానని చెప్పారు. డంపింగ్ యార్డులో ఇంటి స్థలం పట్టా ఇచ్చారని, స్థలం చూపలేదని పలువురు మంత్రి దృష్టికి తీసుకురాగా డంపింగ్‌యార్డు స్థలంలో ఎవరికి కూడా ఇళ్ల ఇవ్వడం లేదని, మరో చోట ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, త్వరలోనే మరో చోట ఇస్తామన్నారు.

అంధత్వంతో బాధపడుతున్న యువతికి చేయూత

వార్డులో బూసం కోట వెంకటేశ్వరరావు కుమార్తె పూర్ణిమ్మ పాక్షికంగా ఎడమ కంటి అంధత్వంతో బాధపడుతున్న విషయం తెలిసిన మంత్రి జోగి రమేష్ ఆరోగ్యశ్రీ వైద్యాధికారులతో మాట్లాడారు. వ్యాధి రెండో కన్నుకు కూడా పాకి చూపు మందగించడంతో పాటు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్నట్లు తెలిసిన మంత్రి కంటి చికిత్సకు పూర్తి బాధ్యత తీసుకుంటానని చెప్పారు. తక్షణం మెరుగైన వైద్యం అందించేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రస్తుతం మంచి మందులు వాడాలంటూ రూ.10 వేలు అందించారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

12వ వార్డుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. మాజీ కౌన్సిలర్ జన్ను లీలాకుమారి, ఆమె భర్త రాంబాబు వైఎస్సార్ సీపీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా మంత్రి జోగి రమేష్ ఆహ్వానించారు. వార్డు టీడీపీ యువజన నాయకుడు చాపరజాముల భగవాన్ మంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్ బళ్ల గంగయ్య, మెట్ల గోపి, గరికిముక్కు చంద్రబాబు, వార్డు ఇన్‌చార్జి వీర్నాల మాధవరావు, వన్నెంరెడ్డి మహంకాళరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లి, తహసీల్దార్ మధుసూదనరావు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, అధికారులు పాల్గొన్నారు.

పండుగలా పెన్షన్ల పంపిణీ



అవనిగడ్డలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



గూడూరులో వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న ఎంపీపీ మధుసూదనరావు



నిడమర్రులో పింఛన్ అందజేస్తున్న జోగి రాజీవ్

గూడూరు: ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం బుధవారం పండుగలా సాగింది. గూడూరు మండలంలో మొత్తం 8,282 సామాజిక పెన్షన్లు ఉండగా సాయంత్రం 6.40 గంటలకే 7,162 మంది లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము అందజేశారు. మండలంలో 86.5 శాతం పెన్షన్లు పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. గూడూరులో ఎంపీపీ సంగా మధుసూదనరావు లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేయగా, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు పటాన్‌పేటలో లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు.

పెన్షన్లు అందజేసిన ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: అవనిగడ్డ 1వ సచివాలయం, పులిగడ్డ సచివాలయం పరిధిలోని పలు చోట్ల ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కృత్తివెన్ను: కృత్తివెన్ను మండలం నిడమర్రు పంచాయతీలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ తనయుడు రాజీవ్ వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా 7,047 పింఛన్లకు గాను బుధవారం సాయంత్రానికి 90శాతానికి పైగా పంపిణీ చేశారని ఎంపీడీఓ పిచ్చిబాబు తెలిపారు.

జిల్లాలో మచిలీపట్నానికి ద్వితీయ స్థానం

మచిలీపట్నంటౌన్: డివిజన్‌లోని వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి తెల్లవారుజామునే పింఛనుదారుల తలుపుతట్టి పింఛను సొమ్మును అందజేశారు. మగ్గాల కాలనీలో దివ్యాంగుడు దామాల రవికుమార్‌కు 36వ డివిజన్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దార్ల చెన్నకేశవరావు, గృహ సారథులు రవితేజ, కుమారి, వలంటీర్ నామాల బ్రహ్మాజీతో కలిసి పింఛను అందజేశారు. నగరంలో మొత్తం 18,600 పింఛన్లు ఉండగా బుధవారం రాత్రి ఏడు గంటల వరకు 17,447 మందికి పింఛన్లు పంపిణీ చేసి 93.35 శాతం లక్ష్యాన్ని సాధించారు. దీంతో జిల్లాలో పింఛన్ల పంపిణీలో నగరం ద్వితీయ స్థానంలో నిలిచింది. మరో 1,243 మందికి పింఛన్లు పంపిణీ చేస్తే 100 శాతం పంపిణీ పూర్తవుతుంది.

ఉపాధి నిధులతో విస్తృత అభివృద్ధి

- ప్రతి గ్రామంలో రూ.కోటితో ప్రభుత్వ భవనాల నిర్మాణం
- ఎమ్మెల్యేలు సింహాద్రి రమేష్‌బాబు, కైలే అనిల్‌కుమార్
- పురిటిగడ్డలో గ్రామ సచివాలయ భవనం ప్రారంభం



పురిటిగడ్డ గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు సింహాద్రి, కైలే

పురిటిగడ్డ (చల్లపల్లి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో ఉపాధి హామీ నిధులతో విస్తృత అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. బుధవారం చల్లపల్లి మండలం పురిటిగడ్డలో ఉపాధి పథకం నిధులు రూ.40 లక్షలు, ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ విరాళం రూ.10 లక్షలు కలిపి అధునాతన సౌకర్యాలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యేలు సింహాద్రి రమేష్ బాబు, కైలే అనిల్‌కుమార్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఉపాధి పథకం నిధులు టీడీపీ నాయకులు జేబులు నింపే పనులకు వెచ్చిస్తే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధి నిధులతో ప్రతి గ్రామంలో రూ.కోటితో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, పీఏసీఎస్ గిడ్డంగి ఇలా గ్రామానికి కీలకమైన ప్రభుత్వ భవనాలు నిర్మిస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్నారని చెప్పారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తూ పేద కుటుంబానికి సీఎం జగనన్న పెద్ద కొడుకులా పనిచేస్తున్నారని తెలిపారు. అనంతరం వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, పురిటిగడ్డ సర్పంచ్ మాతంగి రమ్య, పాగోలు, వక్కలగడ్డ సర్పంచ్‌లు తోట శ్రీనివాసరావు, వల్లూరు ఉమా, ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్, రాజులపాటి అంకమ్మ, అవనిగడ్డ డీఎస్పీ ఎండీ మహబూబ్ బాషా, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాలు ప్రారంభం

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని 2,3,5 సచివాలయాలను అవనిగడ్డ, పామర్రు శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు, కైలే అనిల్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యంకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రతిరూపాలుగా నిలుస్తాయన్నారు. పాఠశాలలు, పేదల ఇళ్ల నిర్మాణాలకు మట్టిని తోలుతుంటే అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు, బుద్ధప్రసాద్ పాలనలో పెద్దఎత్తున అక్రమంగా ఇసుక, బుసకను తరలించి గుట్టలుగా పెట్టినపుడు సీఆర్‌జెడ్ పరిధి గుర్తుకు రాలేదా అని ఎమ్మెల్యే సింహాద్రి ప్రశ్నించారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అన్ని రకాల సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. సర్పంచ్ గొరుముచ్చు ఉమా, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు షేక్ నజీర్‌బాషా, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

నగర మేయర్ వెంకటేశ్వరమ్మ



టిడ్కో గృహాల వద్ద రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అన్నారు. బందరు మండలం రుద్రవరం గ్రామంలో నిర్మించిన టిడ్కో గృహ నిర్మాణాల సముదాయంలో రూ. 3.30 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్ల పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబం సొంతింటిలో తలదాచుకోవాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. బందరు నియోజకవర్గంలోని గోసంఘంలో 864 ప్లాట్లు, మండలంలోని రుద్రవరం గ్రామంలో 1,440 ప్లాట్లు వెరసి 2,304 ప్లాట్లను పేదలకు అందజేస్తామన్నారు. టిడ్కో ప్లాట్లకు అవసరమైన మౌలిక సదుపాయాల నిమిత్తం రూ. 3.30 కోట్ల వ్యయంతో మొదటి విడతగా రోడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. 2.2 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టామని చెప్పారు. తాగునీరు, డ్రైయినేజీ నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంకులు, పార్కులు వంటి వసతులను వీలైనంత త్వరగా సమకూర్చి గృహాలను లబ్ధిదారులకు అందజేసేలా బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. డిప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత నోబుల్, టిడ్కో ఎస్ఈ ప్రాజెక్టు ఆఫీసర్ బి. చిన్నోడు, డీఈ సుధాకర్, అసిస్టెంట్ ఈఈ గణేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ సిలార్‌దాదా, మునిసిపల్ కమిషనర్ జి. చంద్రయ్య, మునిసిపల్ ఇంజినీర్ పి. శ్రీకాంత్, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

మచిలీపట్నంటౌన్: 41వ డివిజన్‌కు చెందిన పోలిమెట్ల బుజ్జి ఫిబ్రవరి 26వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ బీమా రూ. 10 వేలను డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు బుధవారం బుజ్జి కుమార్తె దాసరి చిన్నికి అందజేశారు. సచివాలయ అడ్మిన్ శివ, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న ఆలయ పునఃప్రతిష్ఠ



పూజలు చేస్తున్న పేర్ని నాని దంపతులు

మచిలీపట్నంటౌన్: గొడుగుపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 7.38 గంటలకు స్వామి వార్ల విగ్రహాలు, ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరడంతో జీర్ణోద్ధరణకు ఎమ్మెల్యే పేర్ని నాని నడుం బిగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో ఆయన ఆలయ పునర్నిర్మాణానికి రూ. 1.80 కోట్లు మంజూరు చేశారు. భక్తులు మరో రూ. 20 లక్షలను సమకూర్చుకుని దేవదాయ, ధర్మదాయశాఖ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఆలయ పునర్నిర్మాణం చేశారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని), జయసుధ దంపతులు, వారి కుమారుడు కృష్ణమూర్తి (కిట్టు) పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

విజయవాడ వెళ్లి పింఛను అందజేత



విజయవాడ ఆస్పత్రిలో సునీతకు పింఛను అందజేస్తున్న వలంటీర్ రమాదేవి

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం 45వ డివిజన్‌కు చెందిన మువ్వల సునీత గుండెపోటుతో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. 45వ డివిజన్ సచివాలయ వలంటీర్ ఆరేపల్లి రమాదేవి విజయవాడ వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారు సునీతకు పింఛను సొమ్ము అందజేశారు. వలంటీర్ రమాదేవిని కార్పొరేటర్ ఆకుల వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి ఆకుల శ్రీనివాస్ అభినందించారు.

వంటగ్యాస్ ధర వెంటనే తగ్గించాలి

మచిలీపట్నంటౌన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ మచిలీపట్నం నియోజకవర్గ శాఖ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఉల్లింగిపాలెం సెంటర్‌లో గ్యాస్ సిలిండర్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్, ఒడుగు చైతన్యకుమార్, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు వివాదంలో వ్యక్తిపై దాడి

పెడన: నందిగామ గ్రామానికి చెందిన వీరవెంకటేశ్వరరావుపై కాగిత నాగేంద్రం కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి సరిహద్దు వివాదం నేపథ్యంలో మంగళవారం సాయంత్రం వీర వెంకటేశ్వరరావుపై నాగేంద్రంతో పాటు మరో ముగ్గురు కలిసి దాడి చేశారు. గాయపడిన వీరవెంకటేశ్వరరావును మచిలీపట్నం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య పల్లెం శ్రీనివాసరావమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేశారు.

సాగులో మెలకువలు పాటించాలి

గూడూరు: వేరుశనగ సాగులో మెలకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం డీడీఏ కె.జ్యోతిరమణి అన్నారు. మల్లవోలులో వేరుశనగ పంటను జ్యోతిరమణి, శాస్త్రవేత్తల బృందం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వేరుశనగ సాగులో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ గిరిజారాణి, బందరు ఏడీఏ కె.శ్రీనివాసరావు, ఏఓలు పద్మజ, కె.హెప్సిబారాణి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు సహకరించండి

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): శుక్రవారం నిర్వహించనున్న సామూహిక గృహ నిర్మాణాలకు లబ్ధిదారులంతా సహకరించాలని సర్పంచ్ చింతా శ్రీనివాసరావు అన్నారు. గ్రామ సచివాలయ ఆవరణలో లబ్ధిదారులతో గృహ నిర్మాణ శాఖ ఏఈ రాజులపాటి తాండవ కృష్ణ బుధవారం సమావేశం నిర్వహించారు. ఏఈ మాట్లాడుతూ కోసూరువారిపాలెం, మేళ్లమర్రు, మేళ్లమర్తిలంక, ఉత్తర చిరువోలులంక గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మేళ్లమర్తిలంకలోని జగనన్న కాలనీలో 132 మందికి ప్లాట్లు కేటాయించారని చెప్పారు. జగనన్న కాలనీలకు వెంటనే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యంతోపాటు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరరావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ జంపాన గౌతమి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మునగ మొక్కల పంపిణీ

గూడూరు: ఐరన్ లోపాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం చేపట్టిన మునగ మొక్కల పంపిణీ కార్యక్రమం బుధవారం ముక్కొల్లు పంచాయతీలో నిర్వహించారు. సర్పంచుల సంఘ అధ్యక్షుడు సమ్మెట జయవర్ధన్, ఎంపీటీసీ సభ్యుడు వై.శ్రీనివాసరావుతో కలిసి గ్రామంలోని రేషన్ కార్డు దారులందరికీ రెండేసి మొక్కల చొప్పున పంపిణీ చేశారు.